తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# వైభవంగా జగన్నాథ రథయాత్ర



గూడూరు, జులై 13, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్రను భక్తులు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నెల్లూరు ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో ప్రతి ఏటా గూడూరు పట్టణంలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నారు. గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతం నుండి నారాయణమ్మ గుడి వద్ద నుండి రథయాత్ర ప్రారంభమైంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో జగన్నాథుడి విగ్రహాన్ని ఆశీసులను చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. అక్కడి నుండి ప్రారంభమైన ఈ రథయాత్ర పట్టణ పురవీధుల గుండా శోభాయమానంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హరే రామ హరే కృష్ణ అంటూ భక్తి పారవశంగా పారాయణం చేశారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. చిన్నారుల కోలాటం, చిన్నారులు శ్రీకృష్ణుడు గోపికల వేషధారణతో ప్రత్యేకంగా నిలిచారు.

## ఎర్రచందనం అక్రమరవాణాపై

# ఉక్కుపాదం

**కొత్త చట్టాలపై పోలీసుస్టేషన్‌లలో అవగాహన కార్యక్రమాలు**
**పదోన్నతులు కల్పిస్తాం : తిరుపతి డిజిపి ద్వారకాతిరుమలరావు**





తిరుపతి క్రైం, జులై 13, ప్రభాతవార్త

జిల్లాలో ఎర్రచందనం అక్రమరవాణాపై మరింత ఉక్కుపాదం మోపుతామని, ఇప్పటికే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సమర్ధవంతంగా పనిచేస్తోందని రాష్ట్రడిజిపి ద్వారకాతిరుమలరావు తెలిపారు. పోలీసుశాఖా పరంగా నూతనంగా తీసుకువచ్చిన కొత్త చట్టాలపై ప్రజలకు, పోలీసులకు పోలీసుస్టేషన్‌లలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పోలీసులకు పదోన్నతులు కల్పించే విషయంపై కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. డిజిపిగా బాధ్యతలు చేపట్టిన ద్వారకా తిరుమలరావు తొలిసారిగా శనివారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. పోలీసు అతిధిగృహంలో అనంతపురం రేంజ్ డిఐజి డాక్టర్ షిమోషి బాజ్పేయితోకలసి సమీక్షించారు. కొంతకాలంగా జిల్లాల పరిధిలో పోలీసులు, పోలీసు అధికారులు ఎదు ర్కొంటున్న సమస్యలపై ఆరా తీసి వాటికి పరిష్కారం సూచించారు. పోలీసుశాఖలో సమర్ధవంతంగా విదులునిర్వహించడానికి అవసరమైన వనరులు సరిగా లేవని, వాటిలో వాహనాలు పాతబడ్డాయని, త్వరలో కొత్తవాహనాలు సమకూరుస్తామన్నారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్దన్‌రాజు, చిత్తూరు ఎస్పీ మణికంఠచందోలు , అనంతపురం ఎస్పీ గౌతమిశాలి, కడప ఎస్పీ సిద్దార్ధకౌశల్, కర్నూలు ఎస్పీ కృష్ణకాంత్, అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పాల్గొన్నారు.

# విరామమెరగని రక్షకభటులు

**ఐదేళ్ళలో వీక్లీఆఫ్‌లు తెలియదు..!- రెండు షిఫ్టుల డ్యూటీలతో పోలీసులకు విశ్రాంతి కరువు**
**తిరుపతి జిల్లా అంతా 2,600మంది పోలీసులతో సరిపెట్టేస్తున్నారు -పదోన్నతులకు నోచుకోని పోలీసులు**



ప్రభాతవార్త-తిరుపతి:

సమాజంలో ప్రజల ఆస్తుల,మాన రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో 24గంటలూ విధుల్లో ఉండే పోలీసుశాఖలో క్రిందిస్థాయి పోలీసు కానిస్టేబుళ్ళు, హెడ్‌కానిస్టేబుళ్ళు, ఏఎస్ఐల వరకు వీక్లీఆఫ్‌లు ఎరుగరంటే అతిశయోక్తి లేదు. గత ఐదేళ్ళ వైసిపిప్రభుత్వంలో ముఖ్యమంత్రి స్వయంగా హామీ ఇచ్చినా పోలీసులకు వీక్లీఆఫ్‌లు తిరుపతి జిల్లాలోనూ అమలుకాలేదు. పైగా తిరుపతి జిల్లాకేంద్రంలోనేగాక జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్‌లలో రెండు షిఫ్టుల విధానంలో విశ్రాంతి కరువైందని పోలీసు వర్గాలు ఆవేదన వెలిబుస్తున్నాయి. తిరుపతి జిల్లాపూర్తిగా 2,600మంది పోలీసు సిబ్బందితోనే పాలన సరిపెట్టేస్తున్నారని వాపోతున్నారు. జిల్లాలో తిరుపతి,తిరుమల, రేణిగుంట, చంద్రగిరి, శ్రీకాళహస్తి, గూడూరు, సత్యవేడు ప్రాంతాల్లోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు 200మంది వరకు క్రిం దిస్థాయిలో సిబ్బంది ఉండాల్సిన అవసరం ఉన్నా స్టేషన్‌కు 60మందివరకు సరిపెట్టేసి ఎప్పుడో పాతకాలం నాటి సిబ్బంది సంఖ్యనే కొనసాగిస్తుండటంతో రెగ్యులర్ విధులతోబాటు అదనంగా ప్రముఖుల బందోబస్తు, ఇతరత్రా ధర్నాలు, నిరసనలు,భద్రత విదులు స్టేషన్ సిబ్బందితోనే అదనపు భారం మోపుతున్నారని అంతర్మధనం చెందుతున్నారు. తిరుపతి జిల్లా మూడేళ్ళక్రిందట ఏర్పాటుతో పాకాల, యర్రావారిపాళెం,నెల్లూరు జిల్లాలో వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, ఉమ్మడి చిత్తూరుజిల్లాలో వడమాలపేట, పుత్తూరువరకు పోలీసుస్టేషన్‌లో జిల్లాకు చేరాయి. ఇవన్నీ కలుపుకుంటే తిరుపతి, చంద్రగిరి, క్రైమ్, ట్రాఫిక్, రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, పుత్తూరు, నగరి, తిరుమల శాంతిభద్ర తలు, ట్రాఫిక్ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యాయి. వీటిక్రింద దాదాపు 24సర్కిళ్ళ వరకు ఉన్నాయి. ఈ సర్కి ళ్ళ పరిధిలో పోలీసుసిబ్బంది సంఖ్య పెరగకపోవడంతో ఉన్న వారితోనే అదనపు విధులు నిర్వహి స్తున్నారు. దీనివల్ల గత ఐదేళ్ళలో విశ్రాంతి అనేది ,వీక్లీఆఫ్‌లు కూడా పోలీసులకు తెలియదంటే ఆశ్చర్యం లేదు. నగరపరిదిలోని స్టేషన్‌లలో పరిస్థితి ఇలానే ఉంటే మండల పరిధిలోని పోలీసుస్టేషన్లలో పని చేస్తున్న సిబ్బందికీ అదనపు డ్యూటీల భారం తప్పడంలేదని పోలీసులు ఆవేదన చెందుతున్నారు. పోలీసుశాఖలో కానిస్టేబుళ్ళుగా చేరి పది సంవత్సరాలపైన ఇరవై,ఇరవై ఐదేళ్ళు కావస్తున్నా పదోన్నతులు మాట మరచిపోయామని వాపోతున్నారు. జిల్లా భైఫర్‌గేషన్‌తో తిరుపతి జిల్లాలో పోలీసులు పదోన్నతు లకు దూరమయ్యామనే ఆవేదన వుంది. తిరుపతి జిల్లాగా ఏర్పాటైనా పోలీసులు కుటుంబాలకు, ఆరోగ్య పరంగా ఇబ్బందులు తప్పడంలేదు. తిరుపతి జిల్లా పుణ్యక్షేత్రంలో విధులు నిర్వహిస్తుండటంతో కనీసం అవసరమైన సంక్షేమం అమలుచేయాలని కోరుతున్నారు. పదవీవిరమణ చేసిన వారిస్థానంలో కొత్త నియామకాలు లేకపోవడంతో పోలీసులు సిబ్బంది కొరతవెంటాడుతోంది. కనీసం పోలీసు స్టేషన్‌లలో సిబ్బందికి సరైన సౌకర్యాలు కూడా కరువయ్యాయి. కుర్చీలుగానీ, ప్రత్యేకంగా గదులు గానీ లేకపో వడంతో రాత్రి విధులు నిర్వహించే మహిళా పోలీసుల కష్టాలు పై అధికారులకు తెలియకపోవడం బాధాకరమని పోలీసు సంక్షేమ సంఘం నాయకులు పెదవివిరుస్తున్నారు. తిరుపతికి విచ్చేసిన నూతన డిజిపి ద్వారకాతిరుమలరావు పోలీసుల సంక్షేమాన్ని పట్టించుకుని, స్టేషన్‌లలో అదనపు సిబ్బంది నియమాకం చేయాలని పోలీసువర్గాలు కోరుతున్నాయి.




## కుప్పం రెస్కో అవకతవకలపై

# విచారణ కొరడా !!

**విచారణాధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి నియామకం !!**
**ముప్పై అంశాలపై సమగ్ర ఒరిజినల్ రికార్డులు అందించాలని ఆదేశాలు !!**

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో)లో చోటు చేసుకున్న అవకవతకలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సహకార సంస ్థల అదనపు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కె. శ్రీలక్ష్మిని విచారణాధికారిగా నియమిస్తూ సహకార సంస్థల రిజిస్ట్రార్ ఆదేశాలు జారీ చేశారు. కాగా కుప్పం రెస్కో పరిధిలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణకు ఈనెల 18న విచారణాధికారి శ్రీలక్ష్మి కుప్పం రెస్కో కార్యాలయంకు రానున్నారు. రెస్కో పరిధిలో ముప్పై అంశాలకు సంబంధించి సమగ్రమైన సమాచారంతో ఒరిజినల్ రికార్డులు అందజేయాలని ఆదేశిస్తూ ఆమె కుప్పం రెస్కో ఎండికి సమన్లు జారీ చేశారు. ఇప్పటికే కుప్పం పర్సన్ ఇన్‌చార్జ్‌గా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు బాధ్యతలు తీసుకోవడంతో పాటు రెస్కోలో అవకవతకలు జరిగాయని నిర్ధారించిన విషయం విదితమే. సంస్థ ఆర్థికస్థితిగతులు, రిజిస్ట్రేషన్, 2010నుంచి అప్‌డేట్ చేసిన సంస్థ, సర్వీస్ బైలా, పదేళ్ల నుంచి జరిగిన జనరల్ బాడీ సమావేశాల మినిట్స్ పుస్తకాలు, 2010నుంచి సంస్థలో చేపట్టిన నియామకాలు, సంస్థ బడ్జెట్, వ్యయాలు, 2013నుంచి చెల్లించిన మెడికల్ బిల్లులు, రెస్కో సభ్యులకు సెల్‌ఫోన్ల కోసం ఇచ్చిన పదివేల రూపాయలు, మాజీ ఎండి సుబ్రమణ్యంకు ప్రమోషన్ ఇచ్చిన విధానం, నియమనిబంధనలు, 2013-14నుంచి ప్రస్తుతం వరకు ఉన్న ఆర్థిక లావాదేవీలు, మాజీ ఎండి జయచంద్రారెడ్డికి కల్పించిన ఇంక్రిమెంట్లు, ప్రమోషన్ల వివరాలు సమగ్రంగా అందించాలని ఆదేశించారు. అదేవిధంగా రెస్కో పరిధిలో చేపట్టిన ఔట్ సోర్సింగ్ నియామకాలు, జీతాల చెల్లింపులు, రెస్కో అధికారులు హిమ్మత్‌సాగర్, సిఎం ప్రభాకర్‌లకు ఇచ్చిన ప్రమోషన్లు, రెస్కో పాలకవర్గ ఛైర్మన్, సభ్యులకు ఇచ్చిన వేతనాలు, అలవెన్సుల వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. 2019-20లో సంస్థకు ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు, విత్‌డ్రాల వివరాలు, కేంద్ర ప్రభుత్వం యొక్క దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన పథకంలో భాగంగా 2016-20మధ్య చేపట్టిన పనులు, కేంద్రం నుంచి మంజూరైన నిధులు, రెస్కో ఉద్యోగుల టిఎ, డిఎల వివరాలు సమగ్రంగా అందించాలని పేర్కొన్నారు. రెస్కో పరిధిలో చేపట్టిన ఉద్యోగాలకు సంబంధించి ఇచ్చిన అడ్వర్‌టైజ్‌మెంట్లు, నియామకాలకు సంబంధించి అనుమతుల రికార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే గత పాలకవర్గం పరిధిలో సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులు, వారి హోదావివరాలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఆర్.శ్రీనివాసులు, దామోదరంలకు అందించిన గ్రాట్యుటీల వివరాలు, సంస్థకు చెందిన సేవింగ్స్ ఖాతాలు, సంస్థ పరిధిలో చేపట్టిన కొనుగోళ్లు, బిల్లులు ఇచ్చిన తేదీల వివరాలు, ఫర్నీచర్, స్టేషనరీ కొనుగోళ్లకు సంబంధించిన వివరాలు సమగ్రంగా అందించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కుప్పం రెస్కోలో జరిగిన అవకవతకలపై పూర్తిస్థాయిలో జరగనున్న ఈవిచారణలో ఏమేర అవినీతి, అక్రమాలు వెలుగు చూస్తాయో వేచి చూడాలి.

# అందరూ ఊహించిందే !

**తిరుపతి కొత్త ఎస్పీగా సుబ్బరాయుడు**
**మంచి అధికారిగా అందరికీ సుపరిచితుడు**
**ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్‌ఓ బదిలీ**

రాక | బదిలీ







తిరుపతి టౌన్, జులై 13ప్రభాతవార్త:

అంతా ఊహించినట్లే తిరుపతి జిల్లాకు నూతన ఎస్పీ నియమితులయ్యారు. తెలంగాణారాష్ట్రం నుండి ఇంటర్‌కేడర్‌లో మూడేళ్ళ డిప్యూటేషన్‌పై ఇటీవల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన సుబ్బరాయుడు 2013 పోలీసు బ్యాచ్ అధికారి. ఆయన అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు వద్ద సిఎం సెక్యూరిటీలో ఓఎస్‌డిగా పనిచేసి, చంద్రబాబుకు, టిడిపి నాయకులతో సుపరిచయం ఉన్న మంచి అధికారిగా పేరుంది. అనంతపురం జిల్లా బండమీదపల్లికి చెందిన ఆయన తాజా ఐపిఎస్ అధికారుల బదిలీల్లో తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా ఎల్.సుబ్బరాయుడు నియమితులయ్యారు. డిప్యూటేషన్ తరువాత తొలిసారి ఎస్పీగా తిరుపతిజిల్లాకు పోస్టింగ్ దక్కించుకున్నారు. ఆయన తిరుపతిలోని ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ విభాగం ఎస్పీగా కూడా అదనపు బాద్యతలు నిర్వహిస్తారు. తిరుపతి జిల్లాకు నియమితులు కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని, స్వామివారి చెంత పనిచేసే అవకాశం కలగడం తన పూర్వజన్మమ అదృష్టమన్నారు. రెండురోజుల్లో తిరుపతిలో బాధ్యతలు చేపడతానన్నారు. కాగా ఐపిఎస్ అధికారుల బదిలీల్లో తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్‌ఓ డి.నరసింహకిశోర్‌లను బదిలీ చేస్తూప్రభుత్వం శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసింది. టిటిడి సివిఎస్‌ఓగా కొత్తవారిని ఎవరినీ నియమించలేదు. తిరుపతి జిల్లా ఎస్పీగా సార్వత్రిక ఎన్నికల సమయంలో మే నెల 20వతేదీ వి.హర్షవర్ధన్‌రాజు సిఐడి నుండి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలు ముగిసిన తరువాత జరిగిన ఘటనలపై అప్పటి ఎస్పీని బదిలీ చేసిన ప్రభుత్వం ఈయన్ను నియమించింది. ఓట్ల లెక్కింపు తరువాత జిల్లాలో ప్రశాంతవాతావరణం నెలకొనేలా ప్రణాళికాబద్దంగా పనిచేశారు. అయితే ప్రభుత్వం మారడంతో తిరుపతి ఎస్పీ బదిలీ తప్పదనే ప్రచారం జరిగింది. అనుకున్నట్లే శనివారం జరిగిన 37మంది ఐపిఎస్‌ల బదిలీల్లో తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కడప జిల్లాకు బదిలీ చేసింది. టిటిడి సివిఎస్‌ఓగా 2022 ఏప్రిల్‌లో బాధ్యతలు చేపట్టిన నరసింహకిశోర్‌ను ప్రభుత్వం తాజా బదిలీల్లో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా నియమించింది. ఆయన టిటిడిలో తనదైన శైలిలో సౌమ్యుడు అయినఅధికారిగా పేరుతెచ్చుకున్నా ప్రస్తుతం టిటిడిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సమయంలో బదిలీ తప్పలేదు, తిరుపతి,టిటిడిలో పనిచేయడం మరచిపోలేమని ఇద్దరు ఎస్పీ అధికారులు తెలిపారు.

## ఫ్యాన్సీ దుకాణంలో

# భారీ అగ్నిప్రమాదం

**కోటి రూపాయల ఆస్తి నష్టం**



గూడూరు, జులై 13, ప్రభాతవవార్త

గూడూరు పట్టణంలోని కుమ్మరవీధిలో ఎన్నో ఏళ్ళుగా ఉన్న సూర్య ఫ్యాన్సీ దుకాణంలో శనివారం వేకువ జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో పరిసర ప్రాంతాల వారు ఆందోళనకు గురయ్యారు. పోలీసులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి సకాలంలో చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు ఎంతగానో ప్రయత్నించారు. మంటలు ఆర్పేందుకు ఎంతగానో ప్రయత్నించారు. మంటలనఉ అదుపులోకి రాలేదు. అగ్ని మాపక యంత్రంలో నీరు అయిపోయింది. దీంతో మంటలు మరింత వ్యాపించి మూడు అంతస్థుల్లో ఉన్న వస్తువులు కాలిపోయాయి. దట్టమైన పొగ చుట్టుముట్టింది. దుకాణంలో ఉన్న విలువైన వస్తువులు అన్ని కాలిపోయాయి. ఈ సందర్భంగా ఇంచార్జి అగ్ని మాపక అధికారి విజయకుమార్ మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన జరిగిందన్నారు. దుకాణం పూర్తిగా దెబ్బతిందని, ఒక కోటి రూపాయిలు వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని షాప్ యజమానితో అగ్ని ప్రమాదంతో చర్చించారు. అనంతరం ప్రభుత్వ పరంగా సాయం అందేలా చేస్తామని పేర్కొన్నారు. ఈ ఘటన జరగడం బాధాకరం అన్నారు. ఈయన వెంట టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# మహిళ దారుణహత్య

తిరుపతిరూరల్, జూలై 13 ప్రభాతవార్త:

వేదాంతపురం గ్రామ పంచాయతి పరిధిలోని విద్యుత్‌నగర్‌లో ఓ మహిళ హత్యకు గురైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు విద్యుత్ నగర్‌లో మతిస్థిమితం లేని కూతురుతో నివాసం ఉంటున్న రెడ్డెమ్మ అలియాస్ ప్రసన్న (59) నివాసం ఉంటున్నారు. భర్త రామిరెడ్డి వ్యక్తిగత పనులపై కడపకు వెళ్ళగా, శనివారం ఉదయం రెడ్డెమ్మను దుండగలు గొంతుకోసి హత్య చేసారు. విషయం తెలుసుకున్న తిరుచానూరు పోలీసులు రెడ్డెమ్మ హత్యపై ఆరా తీస్తున్నారు. హత్యకు గల కారణాలు తెలసుకునే ప్రయత్నంతో పాటు పోలీసులు జాగీలాలతో హంతకులను గుర్తుపట్టే ప్రయత్నం చేసారు. కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయులకు షాక్

**- జిపిఎస్ అమలు చేస్తూ గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం**

చిత్తూరు టౌన్, జులై 13 ప్రభాతవార్త:

రాష్ట్రంలో కొలువు తీరిన నూతన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు భారీ షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రస్తుతం అమలులో వున్న కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానంను రద్దు చేసి దాని స్థానంలో పాత పెన్షన్ విధానంను అమలులోకి తీసుకువస్తుందని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఆశలు పెట్టుకొన్నాయి. అయితే ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రస్తుతం అమలులో వున్న కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానం స్థానంలో గత ప్రభుత్వం సిద్ధం చేసి అమలు చేయని గ్యారంటీ పెన్షన్ స్కీమ్ విధానంను అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. పాత పెన్షన్ విధానం ప్రభుత్వ ఖజానాకు తలకు మించిన భారంగా మారడంతో పదేళ్ళ క్రితమే ఈ పాత పెన్షన్ విధానంను రద్దు చేసి దాని స్థానంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పెన్షన్ విధానం అమలు చేయూలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ మేరకు దేశ వ్యాప్తంగా ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమలులో వుండగా మరికొన్ని రాష్ట్రాల్లో కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానం అమలులో వుంది. ఎనిమిదేళ్ళ క్రితం అప్పట్లో రాష్ట్రంలో వున్న తెలుగుదేశం ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానంను రద్దు చేసి దాని స్థానంలో కాంట్రీబ్యూటరీ పెన్షన్(సిపిఎస్) విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. అప్పట్లోనే ఈ సిపిఎస్ విధానంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు రోడ్డెక్కాయి. తమకు పాత పెన్షన్ విధానంను అమలు చేయాలని డిమాండ్ చేశాయి. అయినప్పటికీ అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సిపిఎస్ విధానం అమలుపై మొగ్గు చూపింది. ఈ పరిస్థితుల్లో 2019 ఎన్నికలు ముంచుకురావడంతో వైకాపా అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిపిఎస్ విధానంపై ఎలాంటి కసరత్తు చేయకుండానే తాము అధికారంలోకి వస్తే సిపిఎస్ విధానంను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు మొత్తం వైకాపాకు అండగా నిలిచాయి. ఈ ఎన్నికల్లో వైకాపా విజయం సాధించి రాష్ట్రంలో సిఎంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సిఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిపిఎస్ విధానంపై కసరత్తు చేస్తే ఈ విధానంను రద్దు చేయడం కష్టసాధ్యమని తేలింది. ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానంను అమలులోకి తీసుకురాకపోయినప్పటికీ సిపిఎస్ స్థానంలో మధ్యేమార్గంగా ఒక సరికొత్త పెన్షన్ విధానంను అమలు చేయాలని భావించి గ్యారంటీ పెన్షన్ స్కీం(జిపిఎస్)ను తెరపైకి తీసుకువచ్చారు. ఈ విధానంపై కసరత్తు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలతో ప్రభుత్వం చర్చించినప్పటికీ ఈ విధానంపై ఉద్యోగ, ఉపాధ్యాయులు సంతృప్తి చెందలేదు. తమకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేయడం ప్రారంభించారు. అంతలో 2024 సార్వత్రిక ఎన్నికలు ముంచుకు రావడంతో ప్రభుత్వం జిపిఎస్ అమలుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో వుంచి ఎన్నికలకు వెళ్ళింది. ఈ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వైకాపాకు వ్యతిరేకంగా ఓటు వేసి తమ కక్ష తీర్చుకున్నారు. ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలపడంతో ఎన్నికల్లో విజయం సాధించి సిఎంగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల కోర్కెలు సిఎంగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబునాయుడుకు బాగా తెలుసునని ఎలాగైనా సిఎం సిపిఎస్ విధానంను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను అమలు చేస్తారని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆశలు పెట్టుకున్నారు.

## రాజనాలబండపై డిష్యూం డిష్యూం...!

-ఇరువర్గాలకు గాయాలు

చౌడేపల్లి, జూలై 13 ప్రభాతవార్త



పంచాయతీ పెట్టి ఇరువర్గాలను రాజీ చేద్దామనుకొని వచ్చిన పెద్దమనుష్యులు...ఆ తీర్పు నచ్చని మరొక వర్గం పరస్పరం దాడి పాల్పడ్డారు. దీంతో శనివారం రాజనాబండపై ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మండలంలోని దిగువపల్లి పంచాయతీ కొలింపల్లి పాళ్యం నాగరాజ అదే గ్రామానికి చెందిన ఓ మహిళను సంవత్సరం క్రితం ట్రాక్టర్‌తో తొక్కించాడు. ప్రస్తుతం ఆమె చికిత్స చేయించుకొంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఆసాది ప్రభాకర్(45), అతని చిన్నాన్న ఆసాది నాగరాజులు బాధితురాలికి న్యాయం చేయాలని ఇరువర్గాలను రాజనాబండకు పిలిపించి రాజీ కుదుర్చే ప్రయత్నం చేసారు. బాధితురాలికి పరిహారం ఇవ్వాలని కోరారు. అయితే వారి తీర్పు సరిగా లేదని గణేష్ పెద్దమనుష్యులపై దాడి చేసి గాయపరచాడు. వారిలో ప్రభాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానికులు మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు బాధితుడు ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. కాగా ప్రభాకర్ సానుభూతి పరులు గణేష్‌పై ఎదురుదాడి చేసి గాయపరచినట్లు బాధితుడు తెలిపాడు.

## ఆర్‌జియుకెటి ఐఐఐటి మెరిట్ సాధించిన జె. చరణ్

చిల్లకూరు, జులై 13 ప్రభాతవార్త



ఆర్‌జియుకెటి ఐఐఐటి - 2024లో ఆరు సంవత్సరాలు సమీకృత ఇంజనీరింగ్ కోర్సు లో ప్రవేశం కోసం ప్రకటించిన మెరిట్ జాబితాలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నతపాఠశాల చిల్లకూరు నందు ఎస్ఎస్‌సి 2024 పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన చరణ్ ఆర్‌కె వవ్యాలీ ఇడుపులపాయ కాలేజీలో ప్రవేశం కోసం ఎంపియ్యాడని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్ పీటర్, పాఠశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు

## దారి తప్పుతున్న ఆర్‌టిసి బస్సులు: ట్రాఫిక్‌కు అంతరాయం

శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతుంది.అసలే ఇరుకు వీధులు లెక్కకు మించిన వాహనాలు.పోలీసులు నానా తిప్పలు పడుతూ వన్ సైడ్ పార్కింగ్ అమలు చేస్తున్నారు. అయితే ట్రాఫిక్‌కు సహకరించాల్సిన ఆర్‌టిసి, ఆటోల చోదకులు సహకరించకపోవటంతో పరిస్థితి ఆగమ్యాగోచరంగా మారింది. ముఖ్యంగా కూడలి ప్రాంతాల్లో ఓ వైపు ఆటోల చోదకుల హంగామాతో ఇబ్బంది ఏర్పడుతుంది. పట్టణంలోని కృష్ణారెడ్డి మండపం వద్ద గతంలో ఆర్‌టిసి బస్సులు ఆపి దేవాలయానికి వెళ్ళు యాత్రికులకు ఆర్‌టిసి డ్రైవర్లే దారి చూపే వారు. భక్తులు ఎంచక్కా ఆలయానికి వెళ్ళే వారు. అయితే ట్రాఫిక్ క్రమబద్దీకరణలో భాగంగా రామసేతు వంతెన సమీపంలో అన్నా క్యాంటీన్ వద్ద తిరుపతి వైపు నుంచి వచ్చే ఆర్‌టిసి బస్సులు నిలిపి భక్తుల్ని దింపుతున్నారు.దాంతో యాత్రికులు ఆలయానికి ఎలా వెళ్ళాలో తెలియక తికమక పడుతున్న సమయంలో ఇక్కడ ఆటోల వ్యాపారం మొదలౌతుంది.అలాగే ఆలయానికి 2వ గేటు వద్ద కూడా ఆటోల హంగామా సాగుతుంది. దాంతో వచ్చే పోయే వాహనాలకు ఇబ్బందిగా మారుతుంది.

**ఆర్‌టిసి బస్సులు దారి తప్పటంతో: స్థంభన:**

శనివారం ఉదయం జలవినాయక ఆలయం వద్ద గంటల కొద్ది ట్రాఫిక్ స్థంభించింది.కారణం పరిశీలిస్తే వంతెనపై కార్లు పార్కింగ్ చేసారు. దానికి తోడు ఆర్‌టిసి బస్సులతో పాటు పల్లె వెలుగు బస్సులు కూడా ఈ మార్గంలో రావటంతో వందల కొద్ది వాహనాలు నిలిచిపోయాయి.ఇక ఆలయానికి వచ్చిన వారు అత్యవసర పనుల మీద వెళ్ల వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జలవినాయకుని ఆలయం వద్ద ఇరుకుగా ఉంటుంది. ఇక్కడ ఆర్‌టిసి బస్సులు మలుపు తిరగటం కష్టం. అయితే ఎందుకో ఆర్‌టిసి నిర్లక్ష్యమో? ఉదాసీన వైఖరో తెలియదు కానీ కొన్ని తమిళనాడు,సూళూరుపేట,గూడూరు డిపోలకు సంబంధించిన బస్సులు భిక్షాల గాలిగోపురం నుంచి సన్నిధివీది మీదుగా సాగాలి. అయితే రాజగోపురం పక్కన ఇరుకు రామమందిరం వద్ద మలుపు, జలవినాయక ఆలయం వద్ద మలుపు తిరగాలంటే వెనుక ఉన్న వాహనాలు నిలిచి పోతున్నాయి. శనివారం వరుస సెలవులతో శ్రీకాళహస్తీశ్వరాలయం కిట కిట లాడింది.ఈ తరుణంలో రెండు శ్రీకాళహస్తి డిపోకు చెందిన పల్లె వెలుగుల బస్సులు ఆగిపోవటంతో పరిస్తితి ఆగమ్యగోచరంగా మారింది.

**దారితప్పుతున్న ఆర్‌టిసితో ఇబ్బందులు:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆర్‌టిసి బస్టాండు ఆలయానికి ఓ మూల ఉంది. దాంతో ఎన్నో పరిశీలనలు,

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగివుండాలి

తవణంపల్లె, జూలై 13 ప్రభాతవార్త:



రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగివుండాలని తవణంపల్లె ఎస్సై అనిల్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రౌడీషీటర్లు, పాతనేరస్థులు, అనుమానితులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసం దర్భంగా ఎస్సై మాట్లాడుతూ పాతనేర స్థులు, రౌడీ షీటర్లు, అనుమానితులు సత్ప్రవర్తన కలిగివుండాలని తెలిపారు. అలాగే మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సమాచార వారధులుగా వుండాలన్నారు.స్థానికంగా ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు వంటివి జరిగితే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. సత్ప్రవర్తన కలిగి వుండకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించడంతో పాటు జిలవ్ల బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కాణిపాకంకు పోటెత్తిన భక్తజనం

-దర్శనానికి నాలుగు గంటల సమయం

కాణిపాకం, జూలై 13 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు రెండవ శనివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు.అలాగే తిరుమల వెళ్ళే తీర్థజనం కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తుల రద్దీ తీవ్రస్థాయిలో వుండడంతో విఐపీ దర్శన గేటు వద్ద బారులు తీరి గంటల తరబడి నిలబడ్డారు. రద్దీ కారణంగా ఆలయం వద్ద కొద్ది సేపు లడ్డూల కొరత ఏర్పడింది. అలాగే భక్తులు వచ్చిన వాహనాలను పార్కింగ్ చేసేందుకు స్థలం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే వాహనాల రద్దీ కారణంగా పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.



## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, జూలై 13 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు నెల్లూరుకు చెందిన ఉమామహేష్ అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి చెక్కు రూపంలో ఆలయ

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## 3రోజుల పాటు పత్రీజీ మహిళా చైతన్యం

చిత్తూరురూరల్, జూలై 13 ప్రభాతవార్త:

కాణిపాకం సమీపం, సిద్దంపల్లెలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రం నందు ఈనెల 19,20,21 మూడు రోజుల పాటు డాక్టర్ సితామహ బ్రహ్మర్షి సుభాష్ పత్రి సతీమణి స్వర్ణమాల పత్రిచే మహిళా చైతన్యం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా స్పిరిచువల్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచువల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. బి.గోపాలక్రిష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దిపవర్ ఆఫ్ మెడిటేషన్, ది పవర్ ఆఫ్ థింకింగ్‌తో పాటు 18 ఆదర్శసూత్రాలు, 13వ్యక్తిగత సూచనలు, ధ్యానం, స్వాధ్యాయమ్, సజ్జన సాంగత్యం తదితర కార్యక్రమాలు వుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ధ్యానులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని ట్రస్ట్ కన్వీనర్ రాధిక గోపాలక్రిష్ణమూర్తి పేర్కొన్నారు.

## నిరాశ్రయులకు ఉచిత బిసీజి టీకా

చిత్తూరురూరల్, జూలై 13 ప్రభాతవార్త:

నగరపాలక సంస్థ సహకారంతో సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతిగృహంలోని నిరాశ్రయులకు ఉచితంగా క్షయనివారణ కోసం ఉచితంగా బిసిజీ టీకా వేయించినట్లు వసతిగృహ నిర్వాహకులు జోసఫ్‌రాజు తెలిపారు. నిరాశ్రయులకు నిరంతర వైద్యసేవలు అందిస్తూ ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సిబ్బందది ప్రమీళ, శశిరేఖ, శ్రీను, ఏఎన్ఎం కవిత, ఆశ వర్కర్ రాధ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజల రుణం తీర్చుకోలేనిది

– తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరురూరల్, జూలై 13 ప్రభాతవార్త:



ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజల రుణం తీర్చుకోలేనిదనీ, 14 సంవత్సరాలుగా ప్రజారాజ్యం, తెలుగుదేశం, వైసిపి జిల్లా అధ్యక్షుడిగా ప్రజలకు సేవ చేసే అదృష్టం కలిగిందనీ, ఆదరించిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటానని తిరుపతి నియోజకవర్గ శాసనసభ్యులు ఆరణిశ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం చిత్తూరులోని స్వగృహానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును జనసేన, టిడిపి, బిజెపి పార్టీ నేతలు, కార్యకర్తలు. జెఎంసి అభిమానులు అధిక సంఖ్యలోపాల్గొని అభినందలు తెలిపారు. ప్రజల అభిమానంతోనే రాయలసీమలోనే అత్యధికంగా 63వేల ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందానని, తిరుపతిలో ఇప్పటివరకు చూడని అభివృద్దిని పవన్‌కళ్యాణ్, చంద్రబాబు నేతృత్వంలో చేసి చూపిస్తానన్నారు. వీరితో పాటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను చిత్తూరు నగర మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత ఎంఎస్‌బాబులు ఆయన స్వగృహంలో కలసి అభినందనలు తెలిపారు.

## అగరంపల్లె వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాణిపాకం, జూలై 13 ప్రభాతవార్త:

కాణిపాకం గ్రామ పంచాయతీ అగరంపల్లె సమీపం ఐరాల-చిత్తూరు రహదారి పక్కన వైన్‌షాపు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి వుండడాన్ని శనివారం స్థానికులు కనుగొని పోలీసులకు సమాచారం అందించినట్లు స్థానిక ఎస్సై రామ్మోహన్ తెలిపారు. గళ్ళ చొక్కా, లుంగీ ధరించి సుమారు 45 ఏళ్ళు వయస్సు కలిగిన వ్యక్తి వైన్‌షాపు సమీపంలో మృతి చెంది పడివుండగా స్థానికులు గుర్తించి సమాచారం అందించినట్లు తెలిపారు. ఈమేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించగా బిచ్చగాడిగా తేలినట్లు తెలిపారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని ఖననం చేయడానికి గ్రామ పంచాయతీకీ అప్పగించినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 21మంది ఎంపిక

కుప్పంరూరల్, జూలై 13 ప్రభాతవార్త

కుప్పం లయన్స్‌క్లబ్, పిఇఎస్ ఆస్పత్రి అధ్వర్యంలో శనివారం పిఇఎస్ అర్బన్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు వ ందమంది కంటి సమస్య ఉన్న వారు శిబిరానికి హాజరయ్యారు. వారికి వైద్యులు క ంటి పరీక్షలు జరిపి ఇరవై ఒక్కమందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ సలహాదారు డా॥ మహేష్, సభ్యులు పాల్గొన్నారు. శిబిరంకు హాజరైన వారికి రవీంద్రనాథ్, పిఎంఆర్ కుటుంబీకులు భోజన వసతి సమకూర్చారు.

---

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఫీల్డ్ అసిస్టెంట్లపై కక్షసాధింపు చర్యలు తగదు

కోట, జూలై 13 ప్రభాతవార్త

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ఉపాధి హామీపథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టడం మంచి పద్ధతి కాదని వైసీపీ నాయకులు, సిద్ధవరం సొసైటీ అధ్యక్షుడు పాదర్తి రాధాకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో వైసీపీ పాలనలో ఏ శాఖ ఉద్యోగుల పైనా కక్షసాధింపు చర్యలు చేయలేదని చెప్పారు. అయితే ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే ఫీల్డ్ అసిస్టెంట్లను విఓలను తొలగించాలని ప్రయత్నాలు చేయడం విరమించుకోవాలన్నారు. అసలు ఉపాధి హామీ పథకం కేంద్రప్రభుత్వం ఆధీనంలో నడుస్తుందన్నారు. దీనిపై బిజెపి నాయకులు ఎందుకు నోరువిప్పడం లేదని ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తే ఆ పాపం తెలుగుదేశం ప్రభుత్వానిదే అన్నారు.

## 19 నుంచి చెందోడులో పుట్టాలమ్మ ఉత్సవాలు

కోట, జూలై 13 ప్రభాతవార్త

కోట మండలం చెందోడు గ్రామంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు గ్రామదేవత శ్రీపుట్టాలమ్మ గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్లు పుట్టాలమ్మ ఆలయ భక్తబృందం తెలిపింది. 19న ఉదయం 9 నుంచి 10 గంటలలోపు అమ్మవారికి అభిషేకం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల్లోగా పుట్టబంగారం తీసుకు రావడం, 20న అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం అన్నప్రసాదం, 3 గంటలకు వెంకటేశ్వరస్వామి కలశం, బాణాసంచా వేడుకలతో వివిధ పుష్పాలంకరణలతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించడం, 21న అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 3 గంటలకు ఆలయంలోకి పుట్టబంగారం తీసుకురావడం, రాత్రి 9 గంటలకు అమ్మవారి కథ ప్రస్థానం, 22న అమ్మవారికి పంచామృతాభిషేకం, తప్పెట్లు మంగళ వాయిద్యాలు, బాణాసంచా వేడుకలతో అమ్మవారి గ్రామోత్సవం, 23న గ్రామంలో పొంగళ్లు వంటి కార్యక్రమాలు ఉంటాయని కమిటీ తెలిపింది.

## అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంచినీటి సరఫరా

సూళ్లూరుపేట, జూలై 13 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం ట్యాంకుల ద్వారా విద్యార్థులకు మంచినీటి సరఫరా ప్రక్రియకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా శ్రీకారం చుట్టారు. కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో తమకు మంచినీటి వసతి సక్రమంగా లేదని ఆమెకు తెలియజేశారు. ఇందుకు స్పందించిన ఆమె త్వరలోనే మంచినీటి సరఫరా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ట్యాంకర్ల ద్వారా మంచినీటిని తీసుకొచ్చి విద్యార్థులకు అందజేశారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేలా చూస్తామని ఎమ్మెల్యే విజయశ్రీ తెలిపారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పనలో తనవంతు కృషి చేస్తానన్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలని ఆమె గురుకుల పాఠశాల సిబ్బందికి సూచించారు.టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, మాధవనాయుడు, అలవల శ్రీనివాసరావు, వాకిచర్ల రమేష్, ఇవి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికురాలు దుర్మరణం

సూళ్లూరుపేట, జూలై 13 ప్రభాతవార్త

పొట్టకూటి కోసం భవన నిర్మాణ పనులకు వచ్చి పనుల్లో నిమగ్నమై ఉండగా ప్రమాదశాత్తు మిల్లర్‌లో పడి అశువులుబాసిన మహిళ ఉదంతం శనివారం సూళ్లూరుపేటలో చోటుచేసుకుంది. చిట్టమూరు మండలం కుమ్మరిపాలెంకు చెందిన ఎర్రబోతు ఇందిరమ్మ (45) అనే మహిళ భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ పనులు చేసేందుకు చిట్టమూరు మండలం కుమ్మరిపాలెం నుంచి కుటుంబంతో సహ బయలుదేరి సూళ్లూరుపేటకు చేరుకుంది. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో కొండా రమణయ్య అనే మేస్త్రీ వద్ద మిల్లర్‌లో కాంక్రీట్‌తో శ్లాబు వేసే పనికి వచ్చింది. ఇదిలావుంటే కాంక్రీట్ పోస్తూ మధ్యలో టీ తాగేందుకు మిల్లర్ సమీపంలోకి వచ్చింది. ఇందిరమ్మ మిల్లర్‌కు వెనుకభాగంలో ఉండే సాఫ్ట్ ఆమె తలకు, చీరకు చుట్టుకోవడంతో అక్కడికక్కడే తల శరీరం నుంచి విడిపోయి అక్కడికక్కడే దుర్మరణం పాలయింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ కోట రహీంరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తా

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జులై 13, ప్రభాతవార్త



స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో దయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల వైద్యాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి గ్రస్తులు నెల్లూరు తిరుపతి వంటి ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేసుకుంటున్నారని దీంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఇక్కడే దయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని కూడా చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన డాక్టర్లతో చర్చించరు. డాక్టర్ జిలాని భాష తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సిఎం జగన్‌ను కలిసిన మహేందర్ రెడ్డి

గూడూరు, జులై 13, ప్రభాతవార్త



ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గూడూరు మండలం నెల్లటూరు గ్రామానికి చెందిన జగనన్న సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, వైసిపి స్టేట్ జాయింట్ సెక్రటరీ వూటుకూరు మహేంద్రరెడ్డి శనివారం తాడేపల్లి జగన్ మోహన్ రెడ్డి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. మండలంలోని వైసిపి నాయకులు అంతా వైసిపి గెలుపు కోసం ఎంతో కష్టపడ్డారని, ఒక్కసారిగా వైసిపి ఓటమి పాలు అవ్వడంతో వారందరూ ఎంతో నిరాశతో ఉన్నారని ఆయన జగన్ తెలిపారని, దానికి జగన్మోహన్ రెడ్డి స్పందించి ఎవరు నిరాశ చెందవద్దు అని నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని, సమయం ఉన్నప్పుడు వారిని నేరుగా తన వద్దకు తీసుకురావచ్చని ఆయనకు తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈయన వెంట గూడూరు వైస్ ఎంపిపి శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

## వాకాడులో దోమలతో అల్లాడుతున్న ప్రజలు

వాకాడు, జులై 13, ప్రభాతవార్త

వాకాడు పరిధిలోని పాత దళితవాడ ప్రధాన వీధులలో ప్రజలు దోమల దెబ్బకు అల్లాడుతున్నారు. గత రెండు రోజుల వర్షం పడుతుండడంతో సీజనల్ వ్యాధులతో పాటు, డ్రైనేజీలో మురుగునీటిలో దిబ్బలు దిబ్బలుగా దోమలు పరిస్థితి దారుణంగా ఉంది. సైడ్ కాలవల్లో కొద్దిపాటి వర్షానికి నీరు రావడంతో పాటు ఇళ్లలో నుంచి వర్షపు నీరు కూడా మురికి కాలువలలో చేరడంతో దోమకాటు దెబ్బకు తమకు ఏ రకమైన ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమిస్తాయోనని వాకాడు గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సైడ్ కాలువలలో మురికి గొంతులలో ఎక్కువగా చెత్త చెదారం ఉండడంతో అప్పుడప్పుడు పరిశుభ్రంగా చేద్దామని పంచాయితీ అధికారులు పట్టించుకునే దాఖలు లేవు, రోజు రాత్రి వేళలో కొద్దిపాటి వర్షం పడుతుండడంతో దోమలు బెడద ఎక్కువై డెంగీ జ్వరం మొదలకు విష జ్వరాలతో పాటు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ఎందుకంటే దోమల గుడ్లను నివారించేందుకు పంచాయితీ అధికారులు ఎలాంటి నివారణ చర్యలు చేపట్టలేదు. కనీసం సైడ్ కలవలో బీచింగ్ కూడా చల్లడం లేదు. వాకాడులోని పాత దళితవాడ బీసీ కాలనీ, ఎస్టీ కాలనీ, కొత్త దళితవాడ, టెంకాయ తోపు కాలనీలో సీజనల్ వ్యాధులు ప్రబలంకుండా ఇప్పటికైనా పంచాయితీ అధికారులు స్పందించి రసాయనాలను పిచికారి చేయడం, బ్లీచింగ్ పాగించి తదితర చర్యలను వెంటనే చేపట్టకపోతే అధిక శాతంలో వ్యాధులు వచ్చే అవకాశం వుంది.

## తీరప్రాంతంలో వర్షం.. తడ రోడ్లు అస్తవ్యస్తం

తడ, జూలై 13 ప్రభాతవార్త



గత మూడురోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలతోనే తడ మండలంలో గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తమయ్యాయి. తడ, తడకండ్రిగలలోని ఇంటర్నల్ రోడ్లపైనే నీళ్లు నిలిచి మడుగులుకట్టాయి. కొన్ని పంచాయతీల వారు తమకు నిధుల్లేవని, మురికినీటిని మళ్లించడం కూడా మానేసి ఉన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో కూడా తమకు నిధుల్లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తడలో శనివారం 34.8 మిమీల వర్షపాతం నమోదయింది. ఈ వర్షంతో ఎడగారు వరిపంటకు మేలయిందని రైతులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం రోడ్ల పరిస్థితి, వీధుల దుస్థితి చూసి బిత్తరపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతుండగా ఆయా సచివాలయాల అధికారులు, సిబ్బంది మాత్రం తమ ఇబ్బందులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత అధికారులను గ్రామాల పారిశుధ్యం, ఇతర పనుల వైపు పురమాయించాలని గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## యువతి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

తడ, జూలై 13 ప్రభాతవార్త



తడ వద్ద ఒక పరిశ్రమలో పనిచేస్తున్న చాకలి యశోదమ్మ (27) ఈ నెల 3 నుంచి కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు శనివారం తడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతపురం జిల్లా గుంటకల్లుకు చెందిన యశోదమ్మ అక్కడి ఒక కార్ల కంపెనీలో పనిచేస్తుండేదని, అనంతరం తిరుపతిలో, మూడు నెలల నుంచి తడ వద్ద కంపెనీలలో పనిచేసేదని పేర్కొన్నారు. తడ మండలం కొండూరులోని ఒక హాస్టల్‌లో ఉండేదని, బీహార్‌కు చెందిన ఒకరితో పరిచయాలు ఉండేవని పేర్కొన్నారు. అయితే ఈ నెల 3 నుంచి ఆమె సెల్‌ఫోను పనిచేయకపోవడంతో తాము అనుమానం వచ్చి ఇక్కడ హాస్టల్ వద్ద, పరిశ్రమలో విచారించి ఫిర్యాదు చేసునతన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హాస్టల్ విద్యార్థులు బయట ఆహారం తీసుకోవద్దు

- డాక్టర్ నాగరాజు

కోట, జూలై 13 ప్రభాతవార్త



హాస్టళ్లలోని విద్యార్థినులు బయట ఆహారం తీసుకో వద్దని చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు కోరారు. శనివారం కోటలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు వైద్యశిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్ పకోడా, పానీపూరీ, ఇతర పదార్థాలు తీసుకోకూడ దన్నారు. బయటి ఆహారంలో కల్తీ నూనె, కల్తీ పప్పులు వినియోగిస్తుంటారని చెప్పారు. వాటిని తీసుకున్నందువల్ల విరేచనాలు, వాంతులకు గురవుతారని అన్నారు. విద్యార్థులు మంచి ఆలోచనలతో ఉండాలని సూచించారు. విద్యార్థులు ఆలోచన సరళి సక్రమంగా లేకపోయినా వాంతులు, విరేచనాలు వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. చదువుపై శ్రద్ధతో ధృఢమైన ఆలోచన ఉంటే మంచి ఆరోగ్యం ఉంటుందన్నారు. యోగా, వ్యాయామం నిరంతర సాధనాలని పేర్కొన్నారు. ఇవి విద్యార్థులకు జ్ఞాపకశక్తిని పెంపొందిస్తాయని చెప్పారు.

## బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని

ఎమ్మార్పీ ఎస్, ప్రజాసంఘాల ఆందోళన

వెంకటగిరి, జులై 13, ప్రభాతవార్త



డక్కిలి మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురు కుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న అడుసు మళ్ళీ సరేనా కుటుంబానికి న్యాయం చేయాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డక్కిలి గురుకుల పాఠశాల దగ్గర వారు ఆందోళన నిర్వహించారు. ఐదవ తరగతి చదువుతున్న రాపూరు అరుంధతి వాడకి చెందిన అడసనపల్లి షరీన గత వారం రోజుల నుండి తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న సంబంధిత పాఠశాల సిబ్బంది, ప్రిన్సిపాల్ విధి నిర్వహణలో ఆలస్యం చేయడం వల్ల జ్వరం తీవ్రతమైన చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. బాలికకు జ్వరం తీవ్రమైన తర్వాత వారి తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు సంబంధించి మా దగ్గర వైద్యం లేదు నెల్లూరుకి తీసుకెళ్లండి అని తెలియజేసినట్లు తెలిపారు. దానితో నెల్లూరు తీసుకువెళ్లి అక్కడ కూడా పాపకు వచ్చిన జ్వరానికి సంబంధిత వైద్యం మా దగ్గర లేదు. మీరు వెంటనే చెన్నైకి తీసుకెళ్లిపోండి ఇప్పటికే పాప పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని వవాళ్లు సూచించడం జరిగింది. దానితో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు వెంటనే చెన్నై ఎగ్మోర్ బేబీ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. హాస్పిటల్‌లో పరీక్షల నిమిత్తం అక్కడ ఉన్న డాక్టర్లు ఈ పాపకు సోకిన జ్వరం ఇప్పటికీ వచ్చింది కాదు గత పది రోజుల నుండి ఉందని అన్నారు. ఈ పాప ఈ జ్వరంతో బాధపడుతున్నది మీరు వెంటనే తెలుసుకోకపోవడం వల్ల ప్రాణాపాయ స్థితికి చేరుకుని ఉందని తెలియజేయడం జరిగింది. కానీ ఒత్తిడితో వైద్యం అందించే క్రమంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మృతి చెందిందని డాక్టర్లు ధృవీకరించారు. దీనిపై ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంఘటన జరిగిన పాఠశాలను సందర్శించి జరిగిన వివరాలను పూర్తి స్థాయిలో విచారణ చేయగా ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల దృష్టికి పాప మృతికి కారణమైన సంఘటనలు తెలుసుకోవడం జరిగింది. అందులో ప్రధానమైనటువంటి మృతికి కారణమైన అంశాలలో హౌస్ టీచర్, నర్స్, పాఠశాల పిఈటిని పర్యవేక్షణ చేసేటువంటి ప్రిన్సిపాల్ ప్రధాన కారణమని అర్థమైందన్నారు. ఇందులో భాగంగానే బాధితులతో కలిసి సంబంధిత పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయడం జరిగింది. దీని దృష్టిలో ఉంచుకొని స్థానిక శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ చొరవ తీసుకొని దళిత మాదిగ సామాజిక వర్గానికి చెందిన బాలిక మృతికి కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి అండగా నిలవాలని ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేసాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వాసుదేవర్ మాదిగ, ఉదయ్, గద్దల మునయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మంగళపూరి సురేష్, ఎంఎస్‌పి నాయకులు పల్లిపాటి రవి, మనీ, సునీల్, వేణుగోపాల్ పెంచలయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

## అతివలకు నెలంతా గోరింటాకు సందడి



కోట, జూలై 13 ప్రభాతవార్త : నారీ లోకానికి ఆషాడ మాసం అత్యంత్య ఇష్టమైనది. ఈ నెలంతా వారికి గోరింటాకు సందడే. నవ వధువు పుట్టింటికి వచ్చి మరీ చేతులకు మోహిందీ పెట్టుకుంటారు. వైవిధ్య భరితమైన డిజైన్లతో అలంకరించు కుంటారు. అధ్యాత్మిక పరిమళా లను వెదజల్లే ఈ గోరింటాకు ఆరోగ్యాన్ని సైతం పెంపొంది స్తోందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

ఎందుకు పెట్టుకుంటారంటే :

ఆషాడ మాసంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి.వాతావరణం చల్లపడుతుంది. సూక్ష్మక్రిములు పెరిగి అంటు రోగాలు వ్యాప్తిస్తాయి. అయితే వాతావరణం చల్లపడినా శరీరంలో వేడి మాత్రం అలాగే ఉంటుంది. గోరింటాకులకు వేడిని తగ్గించే గుణం ఉంటుంది. రోగ నిరోదక శక్తి పెంచి రక్త ప్రసరణ జరగేలా చేస్తుంది.అందుకే ఈ మాసంలో మహిళలు ,యువతులు సామూహికంగా ఆలయాల్లో ,ఇంట్లో గోరింటాకు పెట్టుకుని సందడి చేస్తుంటారు. ఆషాఢం మాసం తొలి రోజు గోరింటాకును తీసుకొస్తాం. మహిళలను ఇంటికి ఆహ్వానించి గౌరీదేవి ప్రతిమకు పూజలు చేసి గోరింటాకను దంచుతాం ఆతర్వాత అమ్మవారి పాటలను పాడుతూ అందరం ఒకరికొకరు చేతులకు గోరింటాకును పెట్టుకుంటామని విద్యానగర్ కు చెందిన పలువురు మహిళలు వివరించారు.

# కిడ్నాప్ కేసును చేధించిన పోలీసులు

**-8మంది అరెస్టు-రిమాండ్‌కు తరలింపు**

**-కీలక పాత్రదారి మహిళ ఆయేషా**



నిందితుల అరెస్టుచూపుతున్న టుటౌన్ సిఐ, సిబ్బంది

తొట్టంబేడు, జూలై 13 ప్రభాతవార్త : ఈనెల 8వ తేదీన సాయంత్రం ఆరుగంటలకు తిరుపతికి చెందిన బి.రాఘవయ్య కుమారుడు బి.క్రిష్ణమూర్తి శ్రీకార్యాల్ వెల్ఫేర్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 7వతేదీన మద్యాహ్నం సుమారు 3.30గంటలకు ఆయన తనతో పాటు పనిచేస్తున్న ఆయేషాలో కలసి తన కారులోశ్రీకాళహస్తికి సమీపంలోని రాజీవ్‌నగర్ వద్ద తాను పనిచేస్తున్న సంస్థలోకి కొంతమంది మహిళలు చేరుతారని చెప్పి వారిని చేర్చుకునేందుకు రాజీవ్‌నగర్ గంగమ్మగుడి వద్దకు రాగా అక్కడ కొంతమంది వ్యక్తులు క్రిష్ణమూర్తి కంటో కారం కొట్టి బలవంతంగా కారులోకి అతన్ని మరియు ఆయనతో పాటు వచ్చిన ఆయేషాను ఎక్కించుకుని ఓ అటవీ ప్రాంతంలో కూర్చోబెట్టి చిత్రహింసలకు గురిచేసినట్లు టుటౌన్ సిఐ రారాజు తెలిపారు. ఈనేపధ్యంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న క్రిష్ణమూర్తిని రూ.6కోట్లు డిమాండ్ చేసి అక్కడ నుంచి కారులోనే పల్లంపేట వద్ద గల ప్లాట్స్ వద్దకు తీసుకెళ్ళి చిత్రహింసలకు గురిచేసి అతని కుటుంబసభ్యులకు మరియు స్నేహితులకు ఫోన్‌చేసి రూ.6కోట్లు నగదు డిమాండ్ చేశారని, ఆయన ఏటిఎం కార్డుల ద్వారా రూ.5లక్షలు నగదు డ్రా చేసుకుని మరుసటి రోజు 4.7.2024వతేదీ సాయంత్రం వదలిపెట్టారని తెలిపారు. ఈమేరకు బాధితుడు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదుచేయగా టుటౌన్‌సిఐ రారాజు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చిన సమాచారం మేరకు సిఐ రారాజు, సిబ్బంది రంగంలోకి దిగి కేసును చేదించారు. కృష్ణమూర్తితో పాటు వచ్చిన మహిళనే కిడ్నాప్ డ్రామా తన భర్త, భర్త స్నేహితులైన రామచంద్రారెడ్డి ద్వారా కిరాయి మనుషులను ఏర్పాటు చేసి కృష్ణమూర్తిని కిడ్నాప్‌చేసి ఆయన్ను కొట్టి ఆయన వద్ద నుంచి రూ.5లక్షల నగదు మరియు బంగారు నగలు దోచుకెళ్ళారన్నారు. ఈనేరానికి పాల్పడిన షేక్.అయేషా, న్యామత్, రామచంద్రారెడ్డి, వడ్లపూడి దాము, బందెలలోకేష్, పిడలతగిరి, యాసారపు భార్గవ్, మరియు వెట్టి అనిల్, అబ్జల్, దేవాలు ఉన్నారు. వీరిలో షేక్ అయేషా ప్రమేయంతోనే కిడ్నాప్ డ్రామా నిర్వహించి క్రిష్ణమూర్తిని కిడ్నాప్‌చేసి చిత్రహింసలు చేశారని సిఐ వివరించారు. దీంతో షేక్ అయేషా, న్యామత్, రామచంద్రారెడ్డి, వడ్లపూడి దాము, బందెలలోకేష్, పిడలతగిరి, యాసారపు భార్గవ్, మరియు వెట్టి అనిల్‌ను తిరుపతిలోని విద్యానగర్‌లో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వీరిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు సిఐ తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కిడ్నాప్ కేసులో కీలకపాత్రపోషించిన షేక్ ఆయేషా భర్త ఎర్రచందనం స్మగ్లర్ అని తెలిసింది. కేసును చేదించడంలో ప్రతిభ కనపరిచిన హెడ్‌కానిస్టేబుల్ సురేష్, సిబ్బంది శ్రీను, బాబు, మహేష్, కిషోర్, ద్రాక్షాయని, సుధాకర్, ప్రవీణ్‌లులు ఉన్నారు. ఈసందర్భంగా సిఐ సిబ్బందిని అభినందించారు. పీలేరుకు చెందిన ఆయేషా తిరుపతిలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిసింది.

## గణనాధుని సన్నిధిలో పలువురు ప్రముఖులు





కాణిపాకం, జూలై 13 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించు కున్నారు. ఈమేరకు అమరరాజా బ్యాటరీస్ అధినేత గల్లా రామచంద్ర నాయుడు, ఆయన మనుమడు సినీ నటుడు గల్లా అశోక్‌లు కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు.అలాగే అనంతపురం ఎంపీ లక్ష్మీనారాయణ కుటుంబ సమేతంగా కాణిపాకం స్వామివారిని దర్శంచుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ హరిమాధవరెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెంటెంట్‌లు కోదండపాణి, వాసు,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## జిపిఎస్ ప్రతులు దగ్ధం

**- డిఇఓ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ నిరసన**




చిత్తూరు టౌన్, జులై 13 ప్రభాతవార్త: సిపిఎస్ ఉద్యోగులకు జిపిఎస్ అమలు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట శనివారం యుటిఎఫ్ సంఘ నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను పునరుద్దరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆకాంక్షగా వుంటే గత ప్రభుత్వం జిపిఎస్ అమలు చేస్తామని చెప్పినా తాము చేసిన పోరాటాల ఫలితంగా జిఓ విడుదల చేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెనుకటి తేదీలతో జిపిఎస్ అమలు చేస్తూ రాజపత్రంను విడుదల చేయడం దుర్మార్గమన్నారు. 2023 అక్టోబర్ నుండి సిపిఎస్ ఉద్యోగులను జిపిఎస్‌లోకి తీసుకువస్తూ రాజపత్రంను ఇప్పుడు విడుదల చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం 2017లో ఇచ్చిన మెమో 57ని తక్షణం అమలు చేసి 2003 డిఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయుందరిని తిరిగి పాత పెన్షన్‌లోకి పునరుద్దరించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి మణిగండన్, సహ అధ్యక్షురాలు రెహెనా బేగం, కార్యదర్శులు కె.రెడ్డప్పనాయుడు, కె.సరిత, ఎం.పార్ధసారధి, పంటపల్లె సురేష్, గణేష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్‌పి భాషా, ఆడిట్ కమిటీ సభ్యులు సాధన్‌కుమార్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అపరిష్కృత సంకీర్తనలు... పరిష్కారంతో జన బాహుళ్యంలోకి

**-టిటిడి ఈఓ శ్యామలరావు**



తిరుమల,జులై 13ప్రభాతవార్త : అపరిష్కృతంగా ఉన్న అన్నమాచార్య సంకీర్తనలను పరిష్కరించి, జన బాహుళ్యంలోనికి తీసుకురావాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు అధికారులనుకోరారు. పదకవితా పితామహుడు అన్నమయ్య రచించిన 32వేల సంకీర్తనల్లో ఎన్ని సంకీర్తనలు పరిష్కరించారు, ఎన్ని పరిష్కరించాలని ఆరా తీశారు. కొన్ని వేల సంకీర్తనలు మాత్రమే పరిష్కరించబడ్డాయన్నారు. టిటిడి పరిపాలన భవనంలో శనివారం టిటిడి జెఈఓ గౌతమి, అన్ని ప్రాజెక్టుల అధికారులు గోజగోపాల్, ఆనందతీర్థా చార్యులు, విభీషణశర్మ ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమతో కలసి ఈఓ సమీక్షించారు. దాస సాహిత్యప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తెలంగాణా,తమిళనాడు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలను, దివ్యప్రబంధ ప్రాజెక్టు, నాళాయిర దివ్యప్రాజెక్టు, శ్రీనివాసం కల్యాణం, వైబవోత్సవాల ప్రాజెక్టు,టిటిడి ప్రచురణ విభాగాలపై అభివృద్ధిని ఈఓకు వివరించారు.

## ధూమ్ర వారాహిదేవి అలంకరణలో వారాహి అమ్మవారు



రామచంద్రాపురం, జూలై 13 ప్రభాతవార్త: రాయలచెరువు కట్ట సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం ధూమ్ర వారాహిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. జగద్గురువులు సిద్దేశ్వరనంద మహాభారతి స్వామి వారి దివ్యాశీస్సులతో శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి వివిధ సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం పట్టువస్త్రాలు వివిధ రకాల సుంగంధభరిత పుష్పాలతో ధూమ్ర వారాహిదేవిగా అలంకరించి దర్బారు సేవ నిర్వహించారు. మహిళలు సుహాసినీ పూజలు చేశారు. భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. పీఠం ప్రాంగణంలో సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు.

## ఉపాధ్యాయ సంఘాలకు సత్వరం సమావేశం

**- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు రాష్ట్ర ఎస్టీయు ప్రధాన కార్యదర్శి విజ్ఞప్తి**




చిత్తూరు టౌన్, జూలై 13 ప్రభాతవార్త: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాలతో సత్వరం సమన్వయ సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. చిత్తూరు ఎస్టీయు కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్టీయు కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర ఎస్టీయు ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాధరెడ్డి మాట్లాడుతూ అసంబద్ధమైన 117 జిఓను రద్దు చేసి ప్రభుత్వం విద్యారంగ పరిరక్షణ పట్ల చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన 117 జిఓ కారణంగా ప్రభుత్వ పాఠశాలలు చాలా వరకు మూతపడ్డాయని, ఉపాధ్యాయ పోస్టులు భారీ సంఖ్యలో కుదించబడ్డాయని, ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పడిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఈ జిఓను సత్వరం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమంను కొనసాగించాలని, పెరిగిన ధరలు, జీవన ప్రమాణాలకు అనుగుణంగా మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉమ్మడి సర్వీసు నిబంధనలకు అనుగుణంగా పదోన్నతుల ప్రక్రియ చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని, ఏక ఉపాధ్యాయ పాఠశాలల సమస్యలను నివారించేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే మున్సిపల్, ఎయిడెడ్, గురుకుల, ఆదర్శ పాఠశాలల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, పిఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో వుంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్టీయు ఇన్‌ఛార్జీ సుబ్రమణ్యంరాజు, రాష్ట్ర ఎస్టీయు నాయకులు గంటామోహన్, హేమచంద్రారెడ్డి, శ్రీదేవి, జగన్మోహన్‌రెడ్డి, లోకనాధరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు బోడె మోహన్, యువరాజు, పవన్‌కుమార్‌రెడ్డి, రమణా రెడ్డి, రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆశీస్సులందుకున్నాం





తిరుమల,జులై 13ప్రభాతవార్త : శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకుని అందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నామని పలువురు ఎమ్మెల్యేలు తెలిపారు.శనివారం ఉదయం కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, ఆకేపాటి అమర నాదరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే నరసింహారెడ్డిశ్రీవారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## శ్రీశ్రీశ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం



పుత్తూరురూరల్, జూలై 13 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో శ్రీశ్రీశ్రీ జగన్నాథ రథయాత్ర మహ మహోత్సవం సాయంత్రం వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఇస్కాన్ బృందం వారి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ రథయాత్ర బ్రహ్మంగారి గుడి ఎదురుగా ఎస్‌బీఐ కాలనీ నుంచి శ్రీ జగన్నాథ రథయాత్ర మహా మహోత్సవం నిర్వహించారు. కార్వేటినగరం రోడ్డు కాపు వీధి, బజారు వీధుల మీదుగా నిర్వహించారు. భక్తులు హరేకృష్ణ హరే రామహరే రామ అంటూ భజన చేసుకుంటూ పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం ఇస్కాన్ మందిరంలో ఉదయం 4 గంటలకు గోపూజ తులసి పూజ అనంతరం నరసింహాకీర్తన, గౌరవ హారతి అందరికి సంపూర్ణ ప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఘన స్వాగతం




రేణిగుంట,జూలై 13 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం ఘన స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనంతఓ పాటు రెండు రోజుల తిరుమల తిరుపతి పర్యటన నిమిత్తం రేణిగుంట చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్ చంద్ర, నగరపాలక సంస్థ కమిషనర్ అతిథి సింగ్, డీఆర్‌వో పెంచల్ కిషోర్, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌నాయుడు, ల్యాండ్ అండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తదితరులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

## కుప్పం రెస్కో ఎండిగా సోమశేఖర్ నియామకం

**– తిరుపతి నుంచి డెప్యుటేషన్‌పై బదిలీ !!**

**కుప్పం, జూలై 13 ప్రభాతవార్త**



కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా సోమశేఖర్‌ను నియమిస్తూ తిరుపతి ఎపిఎస్పీడిసిఎల్ ఛైర్మన్ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి ఎస్పీడిసిఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా ప్రస్తుతం సోమశేఖర్ విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు 2025మే 31వతేది వరకు కుప్పం రెస్కో ఎండిగా కొనసాగాలని డెప్యుటేషన్‌పై నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

## కన్నుల పండువగా కల్యాణ వెంకన్న పార్వేట ఉత్సవం

**పోటెత్తిన భక్తజనం .. శోభించిన పండుగ వాతావరణం**



చంద్రగిరి, జూలై 13 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి పార్వేట ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు మార్గంలోని పార్వేట మండపం వద్ద శనివారం అర్చకులు స్వామి వారి పార్వేట ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటలకు ఆలయం నుండి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పార్వేట మండపానికి తీసుకువచ్చారు. క్షేమతలిగ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా దుష్టశిక్షణ కోసం స్వామివారు మూడు సార్లు బళ్ళెంను ప్రయోగించారు. తదుపరి స్వామివారికి ఆస్థానం సమర్పించి, భక్తులకు తీర్ధప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సమూర్తులను తిరిగి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. పార్వేటి ఉత్సవానికి భక్తజనం పోటెత్తగా, శ్రీవారిమెట్టు మార్గం, పార్వేటి మండపం వద్ద పండుగ వాతావరణంలో శోభాయమానంగా కళకళలాడింది. పార్వేట ఉత్సవాన్ని పురస్కరించుకుని టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్స్ నర్రా మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి రూరల్ మండలం, నల్లమానికాల్వ గ్రామంలో గ్రామ దేవత గంగమ్మ దీప నైవేద్యాలు తీసుకెళ్ళుతున్న గ్రామ మహిళలు

- ప్రభాతవార్త, తిరుపతి రూరల్

## ఎయిర్‌పోర్టు అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ సమీక్ష



రేణిగుంట, జూలై 13 ప్రభాతవార్త: తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించిన పలు అంశాలపై రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ ధ్యానచంద్ర, ఇతర అధికారులతో శనివారం చర్చించారు. ఎయిర్‌పోర్టుకు సంబంధించిన పెండింగ్ భూ సంబంధిత, ఎలక్ట్రిక్ లైన్ తదితర అంశాలపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కార దిశగా పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ట్రాన్స్‌కో అధికారులు, కేఈఐ సంస్థ ప్రతినిధులు, జీ సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర్, ఎయిర్‌పోర్టు సివిల్, ఆపరేషనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పగలు ఎండ.. రాత్రి వాన

కోట, జూలై 13 ప్రభాతవార్త : పగలంతా ఎండ వేడికి అల్లాడుతున్న ప్రజలకు శుక్రవారం రాత్రి వరుణుడు ఊరటనిచ్చాడు. మధ్యాహ్నం వరకు భానుడు నడినెత్తిన సుర్రుమనిపించగా, సాయంత్రం 6 గంటల నుంచి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై చిరు జల్లులతో వర్షం మొదలైంది. ఈదురు గాలులతో పలుచోట్ల కుండపోత వాన కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద రోడ్డు నీట మునగడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. మరోవైపు విత్తనాలు వేసి వరుణుడి రాక కోసం నిరీక్షిస్తున్న అన్నదాతలకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

## డెంగీతో గురుకుల విద్యార్ధిని మృతి

**ఆందోళనలో విద్యార్థులు**



వెంకటగిరి, జులై 13 ప్రభాతవార్త : డెంగ్యూ వ్యాధితో దక్కిలి జిఎంసి బాలయోగి గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న అడసనపల్లి సరీనా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రాపూర్‌కు చెందిన రవి, మాధవిల కుమార్తె సరినా గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. బాలికకు పది రోజుల నుండి జర్వం రావడంతో పాఠశాలలోనే ఉంచి చికిత్స అందించారు. అయితే పరిస్థితి మెరుగు పడకపోవడంతో చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. కుమార్తె మృతి చెందడంతో తల్లిదండ్రులు రోధించారు. తోటి విద్యార్థిని మృతి చెందడంతో పాఠశాలలోని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. గురుకుల పాఠశాల సిబ్బంది విద్యార్థులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు మండిపడ్డారు. ఐదో తరగతి చదువుతున్న బాలికకు సక్రంగా వైద్యం అందించకపోవడం వల్ల మృతి చెందారని వారు ఆందోళన చెందారు. బాద్యులపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

## ద్రౌపదీ దేవి ఊరేగింపు



శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీకృష్ణుడు, అర్జునుడు,ద్రౌపదీ దేవి విగ్రహాలను పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. దేవతా మూర్తుల విగ్రహాలను ఎంతో అందంగా అలంకరించి ఉత్సవాన్ని మద్రాసు రోడ్డు,జయరామారావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధిలలో గ్రామోత్సవం సాగింది, ఉత్సవంతో పాటు చిన్న ఆలయాల ఇన్‌చార్జి వెంకటస్వామి, ఉత్సవాల ఇన్‌చార్జి దుర్గాప్రసాద్‌లు పర్యవేక్షించారు.

**CHANGE OF NAME**

I,**POLEM REDDY SUNDARARAMI REDDY** (old Name) doing Cultivation, (Give profession or vocation), residing at D.No.2-56, Subba naidu kandriga Village, Bokkasampalem, Srika lahasti Mandal, Tirupati District, A.P-517 641, Declate that I have Changed, my surname in my name as **POLAMREDDY** (New Surname) **POLAMREDDY SUNDARA RAMI REDDY** (Full new name).